అమ్మకు మానని గాయం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా సిజేరియన్లు

- 50 శాతానికి పైగా ఇలాగే..
- కాసులకు కక్కుర్తితో అత్యవసరం కాకపోయినా కడుపు కోత
- సాధారణ ప్రసవాలపై అవగాహన లోపం



బిడ్డకు జన్మనిచ్చి మాతృత్వం పొందడం మహిళ అదృష్టంగా భావిస్తోంది. ప్రసవం ఆమెకు పునర్జన్మతో సమానం. ఒకప్పుడు అత్యధిక ప్రసవాలు సాధారణ పద్ధతిలోనే జరిగేవి. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రైవేటు ఆసుపత్రులు దోపిడీకి సిజేరియన్లను మార్గంగా చూడటం.. తల్లీబిడ్డా క్షేమంగా ఉండాలని కొందరు కుటుంబీకులు ఆపరేషన్లకు సరే అనడం మరి కొందరు శుభఘడియలు అంటూ కడుపు కోతకు ఒత్తిడి తేవడం.. ఇలా కారణాలు ఏవైనా అమ్మ కడుపుపై మానని గాయం ఏర్పడుతోంది. సిజేరియన్లతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నా పరిస్థితి మారడం లేదు.



ఆస్పత్రిలోని ప్రసవ విభాగంలో చికిత్స పొందుతున్న మహిళలు

భద్రాచలం అర్బన్: ధనార్జనే లక్ష్యంగా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టానుసారంగా సిజేరియన్లు చేసి దోపిడీకి పాల్పడుతున్నారు. సాధారణ ప్రసవాలకు అవకాశం ఇవ్వకుండా సిజేరియన్లు ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. గర్భంలో బిడ్డ అడ్డం తిరగడం వంటి అత్యవసర సమయాల్లో చేయాల్సిన ఆపరేషన్లను కాసుల కోసం అమ్మకు కడుపు కోత పెడుతున్నారు. సిజేరియన్లతో ప్రస వాలు జరగడంతో చిన్న వయస్సులోనే అనేక అనా రోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. గర్భం దాలిస్తే సిజేరియన్ తప్పనిసరి అన్నట్లు పరిస్థితి మార్చేశారు. గర్భం దాల్చిన రెండో నెల నుంచే అవసరం లేకపోయినా స్కానింగ్లు, టెస్టులు, మందులు, టానిక్ పేరుతో రూ.వేలకు వేలు దోపిడీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భద్రాచలం పట్టణంలో దాదాపు 15 ప్రైవేట్ ఆస్పత్రులున్నాయి. వీటిలో శస్త్రచికిత్సలు చేసే ఆస్పత్రుల్లో సుమారు 8 నుంచి 9 వరకు ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ఏ ప్రాంతంలోనైనా ప్రసవాల్లో సిజేరియన్లు గరిష్ఠంగా 15 శాతం మించకూడదు. కాన్పు కష్టమైన సమయాల్లో, తల్లీబిడ్డల్లో ఎవరికైనా ప్రాణహాని ఉండే సందర్భాల్లోనే సిజేరియన్ చేయాలి. రక్తహీనత, అధిక రక్త స్రావం జరిగే అవకాశం ఉన్నప్పుడే ఆపరేషన్కు మొగ్గు చూపాలి. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ, కొందరు కుటుంబీకులు మూఢ నమ్మకాలు మెరిసి సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో 50 శాతానికి పైగా కడుపు కోత ఉంటున్నాయి.

విస్తుగొల్పుతున్న గణాంకాలు..

భద్రాచలం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మొత్తం 342 ప్రసవాలు జరిగాయి. ప్రభుత్వాస్పత్రుల్లో 195, ప్రైవేటు ఆస్పత్రుల్లో 147 ప్రసవాలు నమోదయ్యాయి. పట్టణంలో జరిగిన ప్రసవాల్లో దాదాపు 60 శాతం ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయి. ఇందులోనూ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా ఆపరేషన్లు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో 147 ప్రసవాలు జరిగితే వీటిలో ఎక్కువ శాతం అంటే 123కి పైగా ప్రసవాలు సిజేరియన్ ద్వారా చేయడం విస్తుపోయే వాస్తవం. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా సాధారణ ప్రసవాల సంఖ్య తగ్గుకుంటువస్తుంది. గర్భం దాల్చినప్పటి నుంచి సాధారణ ప్రసవం కావాలని ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లే సరికే ఏదో కారణంతో భయపెట్టి సిజేరియన్ చేయిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు.

ఒక్కో ఆపరేషన్కు వేలల్లో ఖర్చు..

సాధారణ ప్రసవం జరిగితే ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.10 వేలకు మించి బిల్లు కాదు. అదే సిజేరియన్ అయితే పేషంట్ పరిస్థితిని బట్టి, ఆస్పత్రిని బట్టి రేట్లు నిర్ణయిస్తున్నారు. సిజేరియన్కు కనిష్ఠంగా రూ.40 వేల నుంచి గరిష్ఠంగా రూ. 80 వేల వరకు కూడా బిల్లులు వేస్తున్నారనే ఆరోపణలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. భద్రాచలం పట్టణంలోని కొన్ని ప్రముఖ ఆస్పత్రుల్లో సిజేరియన్లు యథేచ్ఛగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ప్రభుత్వ ఆస్పత్రులోని వైద్య సిబ్బంది సాధారణ ప్రసవాలు చేసేందుకు చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలో అవగాహన ఉన్న పలువురు ప్రభుత్వాస్పత్రులకు వెళ్తున్నారు.

ముహూర్తాలు చూసుకుని మరీ..

ఇటీవల కాలంలో ముహూర్తం, శుభ ఘడియలు చూసుకుని మరీ ప్రసవాలు చేయించుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారంతా ప్రైవేటు ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు. ఫలానా రోజు, తేదీ, గంటలు, నిమిషాలను కూడా పాటిస్తూ పిల్లల్ని కనడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. మరికొందరైతే బిడ్డ ఎన్ని సెకండ్లకు బయటకు రావాలో కూడా నిర్ణయించేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సిజేరియన్ల శాతం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వాస్పత్రుల్లో సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చేస్తున్నాం. కేవలం హై రిస్క్ ఉన్న వారిని మాత్రమే సిజేరియన్లకు రిఫర్ చేస్తున్నారు. శుభఘడియలు, ప్రత్యేక తేదీలు, ప్రముఖుల జన్మ దిన రోజులు అంటూ డాక్టర్లపై ఒత్తిడి చేయకూడదు.

– డాక్టర్ లక్ష్మీ శిరీష, జిల్లా వైద్యాధికారి

పరీక్షలు చేయించుకోవాలి



గర్భం దాల్చినప్పటి నుంచి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ప్రతీ నెల బేబీ పెరుగుదల ఎలా ఉందో తెలుసుకుంటూ ఉండాలి. గర్భవతిగా ఉన్న సమయంలో మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. వైద్యుల సూచనలు తప్పని సరిగా పాటిస్తే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుంది. అదే విధంగా నెలలు నిండే సమయంలో గర్భిణులు ఒత్తిడికి గురికావద్దు.

– డాక్టర్ సరోజ, గైనకాలజిస్ట్, భద్రాచలం

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



డీఎస్పీ రాఘవేంద్రరావు

మణుగూరు రూరల్ : అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నేడు నియోజకవర్గంలో 144సెక్షన్ అమలులో ఉంటుందని, మద్యం దుకాణాలన్నీ మూసి ఉంచాలని మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రధాన సెంటర్లలో పోలీసుల పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలెవ్వరూ గుంపులు గుంపులుగా సంచరించరాదని, బాణాసంచా పేల్చడం, ర్యాలీలు, చేయొద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజయోత్సవ ర్యాలీలు నిర్వహించొద్దు..

భద్రాచలంటౌన్/బూర్గంపాడు/గుండాల/దమ్మపేట/ అశ్వాపురం/ అశ్వారావుపేటరూరల్/ కరకగూడెం/ దుమ్ముగూడెం: ఓట్ల లెక్కింపు సందర్భంగా నేడు ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహించొద్దని భద్రాచలం పట్టణ, గుండాల, అశ్వాపురం సీఐలు నాగరాజు రెడ్డి, రవీందర్, బూర్గంపాడు, దమ్మపేట, అశ్వారావుపేట, కరకగూడెం ఎస్సైలు రాజ్కుమార్, రవికుమార్, పి. శ్రీకాంత్, రాజరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతటా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు ఒకే చోట గుమ్మిగూడటం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఈ నెల 5వ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బైక్ ర్యాలీలు, డీజేలు పెట్టి ఊరేగింపులు, బాణాసంచా కాల్చటం వంటి కార్యక్రమాలకు అనుమతులు ఉండవని తెలిపారు. మద్యం అమ్మకాలపై కూడా నిషేధం ఉందని, వైన్ షాపుల యాజమానులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ నిబంధనలు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని తెలిపారు. నిబంధనలను తప్పకుండా పాటించాలని ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

రేగాను కలిసిన నాయకులు



రేగాతో బీఆర్ఎస్ నాయకులు

మణుగూరు రూరల్: బీఆర్ఎస్ పినపాక అభ్యర్థి, ప్రభుత్వ విప్ రేగా కాంతారావును పార్టీ నాయకులు శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నాయకులతో కాంతారావు మాట్లాడి ఎన్నికల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెన్న అశోక్కుమార్, సర్పంచ్లు సున్నం రాంబాబు, గోగ్రైముచ్చు వెంకటరమణ, బీఆర్ఎస్ అశ్వాపురం పార్టీ ఉపాధ్యక్షుడు లకావత్ రామారావు, నాయకులు పాటి చంద్రశేఖర్, ఐతం సత్యనారాయణ, చిన భద్రు, ఖాసీం, ఊకే వెంకటేశ్వర్లు, అశ్వాపురం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వల్లెపోగు రాము, శెట్టి ప్రదీప్, మేకల భాస్కర్, కాలవ సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్'లో ప్రవేశాలకు గడువు పెంపు

బూర్గంపాడు: ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు ఈ నెల 11వ తేదీ వరకు గడువును పెంచుతున్నట్టు బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీ.చిన్యా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్ చదువుకునేందుకు ఎలాంటి విద్యార్హత లేకున్న 14 సం.రాలు నిండిన వారు అర్హులన్నారు. ఇంటర్ ప్రవేశాలకు టెన్త్ పాసైనవారు అడ్మిషన్లు పొందవచ్చన్నారు. వివరాలకు 9701916240 నంబర్ను సంప్రదించాలన్నారు.

దుమ్ముగూడెం: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యం లో ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు మండల అసిస్టెంట్ కోఆర్డినేటర్ కలాం సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 11 లోపు ఆన్లైన్లో కానీ అభ్యసన కేంద్రంలో సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9490908837 నంబర్ను సంప్రదించాలని సూచించారు.

అన్నదానం



చర్ల రూరల్ : కార్తీక మాసం సందర్భంగా పాత చర్ల శ్రీ సీతారామ భక్తాంజనేయస్వామి ఆలయం సన్నిధిలో శనివారం దాతల సహకారంతో భారీ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు మూడు వందల మంది అయ్యప్ప మాలధారులతో పాటు రెండు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలయాల్లో జలగం పూజలు



పూజలు నిర్వహిస్తున్న జలగం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి, శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయాల్లో శనివారం కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాలయ పునర్నిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు , నకరికంటి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జంతువుల వేట చట్టరీత్యా నేరం

జూలూరుపాడు: అడవి జంతువులను వేటాడం చట్టరీత్యా నేరమని జూలూపాడు ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్రావు అన్నారు. శనివారం గుండ్లరేవు గ్రామ పంచాయతీ ఎలుకలొడ్డు గ్రామ శివారులో నివాసం ఉంటున్న గొత్తికోయల ఇళ్లలో జూలూరుపాడు ఎఫ్ఆర్ఓ ప్రసాద్రావు, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గొత్తికోయల ఇళ్లలో సోదాలు నిర్వహించడం జరిగిందన్నారు. గొత్తికోయలు అటవీ జంతువులను వేటాడుతున్నారా? వేటకు ఉపయోగించే ఉచ్చులు, వలలు, బాణాలు, ఆయుధాలు కల్గి ఉన్నారా? అని ఇళ్లలో తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ లక్ష్మీనర్సు, ఎఫ్ఎస్ఓ వి.మల్లయ్య, ఎఫ్బీఓలు చింతా వెంకటేశ్వర్లు, బి.నరసింహారావు, డి.కిషన్, బి.రవి, ఎస్కే రహీం, గొత్తికోయలు తదితరులు పాల్గొన్నారు.

సహకారం మరువలేనిది..




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలలో తనకు ఓటు వేసిన ప్రజలకు, ప్రచారంలో సాయపడిని సీపీఐ, తెలుగుదేశం పార్టీల నాయకుల సహకారం మరువలేనిదని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల రోజుల పాటు తన గెలుపు కోసం అహర్నిషలు కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. భద్రాద్రిలో మరోసారి గెలుపు కాంగ్రెస్దే అని ధీమ వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భద్రాద్రి సమస్యలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న తాను గెలిస్తే పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు దుర్గాప్రసాద్, అజీమ్, సతీష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

నేడు ఓట్ల లెక్కింపు

- గెలుపోటములపై జోరుగా విశ్లేషణ
- మెజార్టీలపై రూ.లక్షల్లో పందేలు



అశ్వారావుపేటరూరల్: ఏపీ, తెలంగాణ సరిహద్దులో ఎస్టీ రిజర్వుగా ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో పోటీలో అభ్యర్థుల్లో నువ్వా..నేనా.! అనే పోటీనే ప్రధానంగా నెలకొంది. ఇప్పటికే గెలుపోటములపై ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే తమదే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి జరిగే ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఓటింగ్ ప్రక్రియ ముగిసిన నాటి నుంచి ఫలితాలపై జోరుగా విశ్లేషణ సాగుతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉండగా, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, బీజేపీ–జనసేన, బీసీవై పార్టీల తోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు కుడా బరిలో ఉన్నారు. దాంతో ఎర్ర పార్టీలతో ప్రధాన అభ్యర్థులైన బీఆర్ఎస్, కాంగ్రెస్లో లాభనష్టాలేవరికో తేలాల్సి ఉంది. విశేషం ఏమిటంటే గడిచిన కొద్ది రోజులుగా గెలుపు ఓటమిను పక్కన పెడితే ఓ పార్టీ అభ్యర్థికు వచ్చే మోజార్టీపైనే లక్షల్లో పందెలు కాయడం.

మండలాల వారీగా ఇలా..

అశ్వారావుపేట నియోజకవర్గంలో మొత్తం 1,55,961 ఓట్లకు గాను గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 1,35,501 ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గంలో అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, చంద్రుగొండ మండలాలు ఉండగా, ఒకొక్క చోట ఒకొక్క విధంగా పార్టీల బలాబలాలు ఉన్నాయి. మండలాల వారీగా పోలింగ్ సరళి ప్రకారం పరిశీలిస్తే.. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగినట్లు ప్రచారం సాగుతోంది. అలాగే అన్నపురెడ్డిపల్లిలో బీఆర్ఎస్కు అధికంగా, చంద్రుగొండలో కాంగ్రెస్కు, ములకలపల్లి మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్కు ఫీఫ్టీగా ఓటర్లు మొగ్గు చూపినట్లు చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీ మాత్రం ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపైనే ఆశలు పెట్టుకుంది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికల హామి, ప్రభుత్వ వ్యతిరేకత, కాంగ్రెస్ హవాపైనే ధీమా వ్యక్తం చేస్తోంది. కాగా సీపీఎం పార్టీ కుడా తన అభ్యర్థిను బరిలో ఉంచడంతో ఈ పార్టీకు దాదాపు 4 నుంచి 5వేల ఓట్లు వచ్చే అవకాశాలు ఉండగా, ప్రజాపంథా పార్టీ అభ్యర్థికు 2నుంచి3వేల ఓట్లు ఖాతాలో వేసుకునే అవకాశాలు ఉన్నాయి. దాంతో ఈ రెండు పార్టీల అభ్యర్థులకు పడే ఓట్లలో సీపీఎం వల్ల కాంగ్రెస్కు, ప్రజాపంథా పార్టీతో బీఆర్ఎస్కు లాభమా.. నష్టమా అనేది తెలియాల్సి ఉంది. ఈ ఉత్కంఠకు నేడు జరిగే ఓట్ల లెక్కింపుతో తెర పడనుంది.

ఘనంగా మహాపడిపూజ



భజన చేస్తున్న అయప్ప మాలధారులు

ములకలపల్లి : మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన అయ్యప్పల మహాపడిపూజ కన్నుల పండుగలా నిర్వహించారు. ములకలపల్లికి చెందిన గాడి తిరుపతిరెడ్డి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురుస్వామి కృష్ణారావు కన్యస్వామి సూర్యకేతన్ రెడ్డిఆధ్వర్యంలో పూజలు చేశారు. కోదాడకు చెందిన భాస్కర్స్వామి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భజన, భక్తిపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

అప్రెంటిస్ విద్యార్థులకు వీడ్కోలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఏరియా వర్క్షాపులో కొంతకాలంగా పనిచేసిన ఎలక్ట్రీషియన్ అప్రెంటిస్షిప్ విద్యార్థులకు అవుట్డోర్ ఎలక్ట్రికల్ టీం ఆధ్వర్యంలో శనివారం వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఏరియా వర్క్షాపు ఎస్ఈ శ్రీకాంత్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, వర్క్షాపు ఇంజనీర్లు ఏ.ఉపేందర్బాబు, బి.శంకర్, టి.అనిల్, సీట్ సెక్రటరీ సత్తార్ పాషా, ఫోర్మెన్ ఇన్చార్జ్ రవి, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న పాయం

కరకగూడెం: మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందని కాంగ్రెస్ నాయకులు ఎట్టి నర్సయ్య తల్లి ముసలమ్మ శనివారం మృతిచెందగా విషయం తెలుసుకున్న పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముసలమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండగా ఉంటానని భరోసానిచ్చారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండలాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సర్పంచ్లు పోలేబోయిన శ్రీవాణి, తోలెం నాగేశ్వరరావు, ఎంపీటీసీ మునీంద్ర, మాజీ సర్పంచ్ పోలేబోయిన తిరుపతయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగబండి వెంకటేశ్వర్లు ఎర్ర సురేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగాలం శ్రమకు చోటేది..?

- మార్కెట్ యార్డు సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యం
- ఆందోళన చెందుతున్న రైతులు



కరకగూడెంలో ఓ రైతు పొలంలో ధాన్యపురాశులు

కరకగూడెం: స్వేదాన్ని చిందించి శ్రమను నమ్ముకుని అప్పులు చేసి మరి పంటలను సాగు చేస్తున్న రైతన్నలకు కష్టాలు పరిపాటుగా మారాయి. ఆదిలో వర్షాలు లేక దిగాలు చెందితే మధ్యలో భారీ వర్షాలతో కుదేలై, చివరిలో తెగుళ్లు, వైరస్లు పంటలకు ఆశించి నష్టపరిచాయి. తీరా పంట చేతికొచ్చాక వాటిని అమ్ముకునేంత వరకు నిల్వ చేసుకోవడానికి మార్కెట్ యార్డ సౌకర్యం లేకపోవడంతో మండల రైతులు వారి వారి పొలాల్లోనే పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఇటీవల వర్షాలు కురవడం, వాతావరణంలో వచ్చే తీవ్ర మార్పులతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని వర్షం వస్తే వారి కష్టం వర్షార్పణం అవ్వడం ఖాయమని వారు భావిస్తున్నారు. రైతు సంక్షేమమే ధ్యేయమనే ప్రభుత్వం రైతులకు అసౌకర్యం కలిగించడమేంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మాటల్లోనే రైతు సంక్షేమం కన్పిస్తుంది తప్పా చేతల్లో లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా మండలంలో మార్కెట్ యార్డు సౌకర్యం కల్పించాలని, ధాన్యంపై కప్పడానికి టార్పలిన్లు అందించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

రక్తపరీక్షా కేంద్రాల్లో దోపిడీ

- కనీస అర్హత లేని వారితో నమూనాల సేకరణ



రక్త పరీక్షా కేంద్రంలోని పరికరాలు

చర్ల రూరల్: ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలంలో రక్త పరీక్షా కేంద్రాల దోపిడీ మితి మీరి పోతోంది.అమాయక గిరిజనుల వైద్య అవసరాలను ఆసరాగ చేసుకున్న రక్త పరీక్షా కేంద్రాల నిర్వాహకులు అడ్డంగా దోచుకుంటున్నారు. రోగాన బారిన పడి పారపాటున ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే అంతే సంగతులు. అవసరం లేకపోయినా టెస్టులు చేయాలని చెప్పడంతో చేసేదిలేక రక్త పరీక్షలు చేయించుకుంటున్నారు. ఒక్కో టెస్టుకు అయ్యే ఖర్చు రూపాయలలో ఉంటే వందలు, వేలల్లో వసూలు చేస్తున్నారు. అతి తక్కువ కాలంలో ఎక్కువ మొత్తంలో సంపాదించాలనే ధ్యేయంతోనే కొంతమంది అనుమతులు కూడా లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రక్త పరీక్షా కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అసలు కొన్ని రక్త పరీక్షా కేంద్రాల్లో కనీస అర్హత లేని వారితోనే రక్త నమూనాలను సేకరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది నిర్వాహకులు డెంగి జ్వరాలు లేకపోయినా ఉందని చెప్పి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం.

అధికారులొస్తే ఆ రోజు సెలవు..

ఏజెన్సీ ఏరియాకు జిల్లా అధికారులెవరైనా వస్తున్నారనే సమాచారం అందితే ఆ రోజు రక్త పరీక్షా కేంద్రాలన్నీ మూసివేసి ఉంటాయి. అనుమతులు సరిగా ఉంటే మూసివేయాల్సిన అవసరం ఏముందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇకనైనా ఏజెన్సీ ప్రాంతంలోని రక్త పరీక్షా కేంద్రాలపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాంప్రసాద్ -79979 58226 టోల్ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎస్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416